ఈనాడు
కుమురం భీం
సోమవారం అక్టోబరు 14, 2024

అంబరాన్నంటిన దసరా సంబరం

ఆసిఫాబాద్ అర్బన్, కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా శనివారం విజయ దశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయాన్నే నూతన దుస్తులు ధరించి సమీప ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం శమీ వృక్ష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్ల మధ్య జరిగిన దసరా వేడుకల్లో వేలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావణ దహనం కనుల పండువగా జరిగింది. బాణసంచా పేలుళ్లు, భక్తుల కేరింతల మధ్య ఉత్సవం ముగిసింది. వేదికపై కళాకారులు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై దసరా వేడుకలు వైభవంగా సాగాయి. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దంపతులు శమీ పూజలు చేశారు. దుర్గామాత, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే దంపతులు, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్ల పూజలు నిర్వహించారు. అనంతరం కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌లు రావణ ప్రతిమ దహనం నిర్వహించారు. తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బంధుమిత్రులంతా కలుసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.


ఆసిఫాబాద్‌లో రావణ దహనం


కాగజ్‌నగర్ త్రిశూల్‌పహాడ్‌పై...


ఆసిఫాబాద్‌లో శమీ వృక్ష పూజలు

అమ్మకు ఘన వీడ్కోలు


ఆసిఫాబాద్‌లో శారదాదేవి విగ్రహాన్ని పెద్దవాగులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

జిల్లాలో ఆదివారం సాయంత్రం దుర్గా, శారదా దేవి విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా వివిధ మండపాల నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి శోభాయాత్ర చేపట్టారు. మహిళల కోలాటాలు, డీజే పాటల మధ్య కనుల పండువగా సాగింది. సమీప జలవనరుల్లో నిమజ్జనం చేశారు.


ఆయుధ పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, చిత్రంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, తదితరులు

మంచి మార్గమే విజయానికి సోపానం


ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మంచి మార్గమే విజయానికి సోపానం అవుతుందని ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం విజయ దశమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించిన ఆయుధ, వాహనాల పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పండితుడు మహేశ్ శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు చేశారు. పోలీసులు వినియోగించే ఆయుధాలను ఒకచోట చేర్చి వాటికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండగ నిర్వహించుకుంటామని గుర్తు చేశారు. ప్రజలు పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ నిరంతరం పని చేస్తుందని చెప్పారు. చెడు మార్గాలు అనుసరించకుండా శాంతియుత సమాజానికి అంతా కృషి చేయాలన్నారు. దసరా వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్ఐలు పెద్దయ్య, అంజన్న, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక లెక్కలు.. తొలగనున్న చిక్కులు

● సమగ్ర కుల గణనకు ప్రభుత్వం శ్రీకారం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

సమగ్ర సామాజిక వర్గ (కుల) గణనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటింటికి తిరిగి అన్ని కుటుంబాలకు సంబంధించి కులంతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులు, విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చేందుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కులాల వారిగా జనాభా గణనకు అవకాశం చిక్కింది. కులగణన చేపట్టడం ద్వారా ఆయా వర్గాలకు దక్కనున్న ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' కథనం.



◆ రాష్ట్ర జనాభాలో అనధికారిక లెక్కల ప్రకారం కులాల వారీగా జనాభా శాతం పోల్చి చూస్తే ఓసీలు 16 శాతం, బీసీలు 45, ఎస్సీలు 18, ఎస్టీలు 10, ముస్లింలు 11 శాతంగా ఉన్నట్లు అంచనా. ఓసీల్లో రెడ్డి 6 శాతం, కమ్మ 3 శాతం, బ్రాహ్మణ, వైశ్య, తెలగ బలిజ 2 శాతం చొప్పున ఉండగా వెలమ 0.5, ఇతర అగ్రవర్ణాలు మరో 0.5 శాతంగా ఉంది. ఇక ముస్లింలలో ఓసీలు 6 శాతం, బీసీలు 5 శాతంగా ఉన్నట్లు అంచనా.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల శాతం ఇలా...

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సగటు ఎస్సీ, ఎస్టీ జనాభాతో పోలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారి జనాభా అధికంగా ఉండటం గమనార్హం. రాష్ట్ర సగటులో ఎస్సీల జనాభా 15.5 శాతంగా ఉంది. ఆదిలాబాద్‌లో 14 శాతం, మంచిర్యాలలో అత్యధికంగా 24.7 శాతం నిర్మల్‌లో 15.2 శాతం, కుమురం భీం జిల్లాలో 15.8 కలిపి సగటున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభాలో 17.8 శాతం ఎస్సీలు ఉండటం గమనార్హం. ఎస్టీల జనాభా తీసుకుంటే రాష్ట్ర జనాభాలో 9.1 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 31.7 శాతం, మంచిర్యాలలో 7.1, నిర్మల్‌లో 11.4, కుమురంభీం జిల్లాలో 25.9 కలిపి ఉమ్మడి జిల్లాలో సగటున 19.02 శాతం ఎస్టీలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు కలిపి మొత్తం జనాభాలో 36.82 శాతం ఉండగా మిగిలిన 63 శాతంలో ఓసీ, బీసీలు ఉన్నారు.

పథకాల రూపకల్పనకు అవకాశం

విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భావిస్తున్న బీసీ జనాభా కంటే కనీసం పది శాతం అధికంగా మొత్తం జనాభాలో 52 శాతం ఉంటుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నారు. గతంతో పోలిస్తే ఓసీ సామాజిక వర్గం జనాభా గణనీయంగా తగ్గి తమ జనాభా పెరిగినట్లు బీసీలు అంచనా వేస్తున్నారు. తమకు జనాభా ప్రాతిపదికన ఫలాలు దక్కాలని పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ప్రభుత్వ పథకాలు, రాజకీయ అవకాశాలకు మాత్రం లెక్కలు ఉపయోగపడే అవకాశముంది.

గణాంకాల్లో వ్యత్యాసాలు

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు, ఇతర సందర్భాల్లో ప్రభుత్వాలు అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల ప్రాతిపదికన సమగ్రంగా జనాభా గణన చేపట్టలేదు. దీంతో కొన్ని సామాజిక వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లో కులం ఆధారిత జనాభా శాతం ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే ఒకటి, రెండు శాతం అటు ఇటుగా ఉన్నప్పటికీ బీసీల జనాభా విషయంలో మాత్రం గణనీయమైన వ్యత్యాసాలు ఉంటాయని ఆ సామాజిక వర్గం భావిస్తోంది. వందకు పైగా ఉప కులాలు ఉన్న తమ జనాభా ఎక్కువగా ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమకు అందాల్సిన ఫలాలు అందడం లేదని వారి వాదన. ఉన్నత న్యాయస్థానం కూడా బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర సగటు ఆధారంగా బీసీల జనాభా ప్రస్తుత అంచనా కంటే ఎక్కువగా ఉండే అవకాశముంది. జిల్లాల వారీగా సగటు చూస్తే జనాభా ఎంత ఉండే అవకాశం ఉంది గణన తర్వాతనే తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వినియోగం లభ్యత ఎంత

● భూగర్భ జలాల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు


భూగర్భజలాల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలపై ఆరా తీస్తున్నారు. ఏటా జిల్లాల వారీగా నీటి అవసరాలు, వినియోగం, లభ్యత తదితర వాటిపై కేంద్ర భూగర్భ జల సంఘం, రాష్ట్ర భూగర్భజల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నాయి. గతంలో మాన్యువల్‌గా నమోదు చేసి లెక్కలు తీయాల్సి వచ్చేది. ఈ సీజన్‌లో గ్రౌండ్ వాటర్ రిసోర్స్ ఎస్టిమేషన్ సిస్టమ్(ఐఎన్ జీఆర్ఈఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామాల వారీగా భూగర్భజలాల లెక్కలను సంబంధిత అధికారులు తీస్తున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 1150 మి.మీ.లు కాగా సగటున 900 మి.మీ.లకు పైగా కురుస్తోంది. సాధారణ వర్షపాతానికి చేరువలో వర్షం కురిస్తే ఆరు మీటర్ల భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఏటా వినియోగం పెరుగుతుండటంతో వనరులు తగ్గిపోయే అవకాశాలున్నాయి. జిల్లాలో ఎక్కువ మంది భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. మిషన్ భగీరథ రాకతో ఉపరితల జలాన్ని ఎక్కువశాతం సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లాల వారీగా 2023లో భూగర్భ జలాల వినియోగం ఇలా ఉంది (హెక్టా మీటర్లలో)

■ వర్షపాతం ■ నీటి లభ్యత ■ వినియోగం

ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
1164	1154	1045	1056
55,241	59,754	86,868	63,935
19,730	9,510	24,489	23,282

◆ జిల్లా జనాభా అవసరం మేరకు తాగు నీటిని అందించేందుకు వీలుగా నీటి వనరులు ఉన్నాయి. అయినా అనేక గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ఉపరితల జలాలను వినియోగించుకునేందుకు జలాశయాల్లోని నీటిని తాగేందుకు వినియోగించుకునేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. వర్షం నీటిని ఇంకించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. గత నివేదిక మేరకు మంచిర్యాల జిల్లాలో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. ఆ తర్వాత నిర్మల్‌లో ఉంది. నీటిని ఇష్టానుసారంగా వినియోగించుకోవడం, వృథా నీటిని భూమిలో ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడంతో భవిష్యత్తులో నీటి సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి పుల్లారావు తెలిపారు. నీటి లెక్కల మేరకు సమస్య ఉన్న మండలాల్లో నీటిని ఇంకించే పథకాలను ప్రవేశపెట్టే అవకాశముందని తెలిపారు.

సొంతింటి కల.. సాకారం దిశగా

● ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలు.. జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పుర కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సోమవారం లోపు కమిటీలను పూర్తి చేసి నివేదించాలని ఆదేశించారు.



పంచాయతీ స్థాయిలో..

సర్పంచి/జీపీ ప్రత్యేక అధికారి కమిటీ ఛైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ సభ్యులుగా ఇద్దరు డ్వాక్రా సంఘ మహిళలు, ముగ్గురు స్థానికులను (గ్రామ అభివృద్ధిపై ఆసక్తి ఉన్న వారిని) ఎంచుకోవాలి. వీరిలో కనీసం ఒకరు బీసీ, ఒకరు ఎస్సీ/ఎస్టీ నుంచి ఉండేలా చూడాలి.

పురపాలిక వార్డుల స్థాయిలో..

వార్డు కౌన్సిలర్/కార్పొరేటర్ ఛైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ సభ్యులుగా పంచాయతీ తరహానే ఇక్కడా అయిదుగురిని ఎంపిక చేయాలి.

జిల్లాలో పంచాయతీలు : **335**
పురపాలికలు : **2**
ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు : **1,54,136**

పనితీరు ఇలా..

ఇంటి నిర్మాణానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం, లబ్ధిదారుల గుర్తింపు, అర్హత ఉన్న కుటుంబాన్ని తప్పుగా మినహాయించినా, అనర్హులను తప్పుగా చేర్చినా, ఇతర గృహ సంబంధ సమస్యలపై సభ్యులు కమిటీ దృష్టికి తీసుకురావాలి. మొత్తానికి ఈ కమిటీ సామాజిక తనిఖీ బృందంగా పనిచేస్తుంది.

◆ ఎంపీడీవోలు, పుర కమిషనర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఎంపిక చేసి కలెక్టర్‌కు అందించాలి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో కలెక్టర్ కమిటీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తారు. వీరికి మండల, పురపాలిక స్థాయిలో అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎంపిక సజావుగా సాగేనా.?

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో భారాస, భాజపాకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. కమిటీ సభ్యులను ఎంపీడీవోలు/పుర కమిషనర్లు ఎంపిక చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అధికార పార్టీ వారు తమకు అనుకూలమైన సభ్యులను, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన సభ్యులను ఎంపిక చేస్తే.. మా పరిస్థితి ఏంటని అధికారులు సందిగ్ధంలో ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పెంచికల్‌పేట్, దహెగాం, న్యూస్‌టుడే: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. శనివారం లగ్గామ-పెంచికల్‌పేట్ మధ్యలో ఉన్న పెద్దవాగుపై అదనపు వంతెన నిర్మాణానికి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కృషితో వంతెన మంజూరైందన్నారు. లగ్గామ నుంచి కల్వాడ వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్తేనే నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. డీఈ లక్ష్మీనారాయణ, గుత్తేదార్లు ప్రవీణ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.


ఇరువర్గాలను చెల్లాచెదురు చేస్తున్న పోలీసులు



ధ్వంసమైన పండ్ల దుకాణంలోని సామగ్రి

నేడు పద్మశాలీల ఆత్మీయ మహోత్సవం

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు పద్మశాలి భవన్‌లో అలాయ్ బలాయ్ (ఆత్మీయ ఆలింగన మహోత్సవం) నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడిక్యాల రాజమౌళి, అనుమాండ్ల కేదారిలు తెలిపారు. ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం హాజరు కానున్నారని పేర్కొన్నారు. పద్మశాలీలు అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు.

కాగజ్‌నగర్‌లో ఉద్రిక్తత

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు వర్గాల సభ్యులు తెలిసిన సమాచారం మేరకు.. దుర్గామాత శోభాయాత్రలో భాగంగా ఓ విషయంలో చోటుచేసుకున్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో ఓ వర్గానికి చెందిన యువకుడిపై మరోవర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. దీంతో అక్కడ నుంచి సదరు యువకుడు తప్పించుకుని రాజీవ్ గాంధీ చౌరస్తా వైపు వెళ్లగా అక్కడ సైతం దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా అక్కడ ఉన్న ఓ దుకాణాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న మరో వర్గానికి చెందిన యువకులు అక్కడకు చేరుకుని దాడి చేసిన వారిపై ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్పీ శ్రీనివాసరావు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. ఇరువర్గాలు చెరోవైపు గుమిగూడారు. పోలీసులు బందోబస్తు కొనసాగిస్తున్నారు.


బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



వంద కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. క్రికెట్ ఆడేస్తూ



ఈమె పేరు సుచరిత. చెన్నూరు పట్టణానికి దగ్గరలోని ఓ గ్రామం నుంచి తెల్లవారుజామునే తన క్రికెట్ కిట్‌తో మంచిర్యాలబాట పడుతుంది. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ కేంద్రానికి 6 గంటలకే చేరుకుంటుంది. దాదాపు తొమ్మిది గంటల వరకు ఇక్కడ సాధన చేస్తుంది. అబ్బాయిల బౌలింగ్‌లో బ్యాటింగ్ చేస్తూ వారికి సైతం బౌలింగ్ చేస్తుంది. రోజులో 5-6 గంటలు క్రికెట్ శిక్షణకు సమయం కేటాయిస్తుంది. డిగ్రీ పూర్తి చేసుకున్న సుచరిత రాష్ట్రస్థాయిలో పలు పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రదర్శన ఇస్తోంది. జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది.

క్రికెట్‌పై ఆసక్తి.. మైదానం బాటపట్టి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే:

పేరుపొందిన నగరాల్లో తప్పితే ఇప్పటికీ అమ్మాయిలకు ఆటలేందుకు అనేవారు ఇంకా లేకపోలేదు. అందులో క్రికెట్ అంటే ఆమడదూరం ఉంచుతారు. కొంత మంది అమ్మాయిలకు క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా తల్లిదండ్రుల కోసం తమ ఇష్టాన్ని పక్కన పెట్టడమో, లేక ఇతర ఆటలపై మొగ్గు చూపడమో చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం దీనిపై మక్కువ చూపిస్తున్నారు. అమ్మానాన్నలను ఒప్పించి మరీ శిక్షణకు సిద్ధమవుతున్నారు. చివరకు వారి ఆసక్తి చూసి నిత్యం కుటుంబ సభ్యులే మైదానానికి తీసుకొస్తున్నారు. వారి సాధనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. అమ్మాయిలు సైతం క్రమం తప్పకుండా మైదానంబాట పట్టి బ్యాట్, బంతితో ప్రతిభ కనబరుస్తున్నారు. శిక్షకుడి సూచనలు, మెలకువలతో మెరుగ్గా తయారవుతున్నారు.

మక్కువ పెంచుకుని సాధన



జైపూర్ మండలానికి చెందిన ఈమె పేరు సంజన. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాది కిందటి వరకు క్రికెట్ అంటే తెలియదు. కానీ గత సంవత్సరం నుంచి ఈ ఆటపై ఆసక్తి పెంచుకుంది. తన తపన చూసి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరంగి గోపాల్ ప్రోత్సహించడం మొదలు పెట్టారు. శిక్షణ కోసం పాఠశాలలో చిన్నపాటి పిచ్ సిద్ధం చేయించారు. దీంతో అబ్బాయిలతోపాటు సంజన సైతం నిత్యం సాధన చేయడం ప్రారంభించింది. ఇటీవల మంచిర్యాలలోని హెచ్‌సీఏ శిక్షణ కేంద్రానికి వస్తూ మెలకువలను నేర్చుకుంటోంది. శిక్షకుడి సూచనలు శ్రద్ధగా వింటూ బౌలింగ్, బ్యాటింగ్ శైలిని మెరుగుపరుచుకుంటోంది.



అమ్మాయిలకు సూచనలు చేస్తున్న హెచ్‌సీఏ శిక్షణ కేంద్రం శిక్షకుడు ప్రదీప్

పదేళ్లు కూడా లేవు.. బ్యాట్ పట్టేసింది



మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సమన్వికి పదేళ్లు కూడా లేవు. బ్యాటింగ్, బౌలింగ్ చేస్తోంది. తన పట్టుదల, క్రమశిక్షణతో శిక్షణ కేంద్రంలోని సీనియర్ క్రీడాకారులతోపాటు శిక్షకుడిని సైతం ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కరాటేలో అనేక పతకాలు సాధించగా క్రికెట్‌పై ఆసక్తితో నిత్యం మైదానానికి వచ్చి పరుగు పెడుతోంది. శిక్షకుడి సూచనలను పాటిస్తోంది. తండ్రి సహకారానికితోడు కావడంతో ఈ చిన్నారి క్రమం తప్పకుండా మైదానానికి వస్తోంది. మెరుగైన ఆటతీరుతో జాతీయ స్థాయికి చేరుతానంటోంది.

కష్టాలు అధిగమించి.. కొలువులు సాధించి

మామడ, న్యూస్‌టుడే: **జీవితం వడ్డించిన విస్తరిలా అన్నీ ఉన్నా కొంత మంది చిన్నపాటి అవరోధాలకే కుంగిపోతుంటారు. అమ్మో.. తనవల్ల కావట్లేదని ప్రగతి సాధించే ప్రయత్నాలు వదులుకుంటారు. ఇంకొందరు ఏమీ లేకున్నా.. పరిస్థితులన్నీ ప్రతికూలంగా ఉన్నా భవిష్యత్తును బంగారు బాట వేసుకునేందుకు శక్తియుక్తులు కూడగట్టుకుంటారు. ఇద్దరో ఈ యువకులకు ఒకప్పుడు కనుచూపుమేరంతా శూన్యంగానే ఉండేది. ఆ చీకటిని పారదోలి జీవితంలో కొత్త వెలుగులు తెచ్చుకునేందుకు వారు పడిన కష్టం స్ఫూర్తిదాయకం.**

అసలే పేదరికం.. ఆపై అమ్మానాన్నలు దూరం

మామడ మండలం న్యూసాంగ్గికి చెందిన గంగారెడ్డి-భూమవ్వ దంపతులకు సుమన్‌రెడ్డి, సురేష్ రెడ్డి ఇద్దరు సంతానం. కొద్దిపాటి వ్యవసాయం ఉన్నా అంతగా గిట్టుబాటయ్యేది కాదు. నిత్యం కష్టాలమయంగానే ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి తండ్రి గంగారెడ్డి మరణించారు. అప్పుడు సుమన్ ఇంటర్ చదువుతున్నారు. సంపాదనకు ఏకైక ఆధారమైన నాన్న కాలం చేయడంతో ఎటూ పాలుపోలేదు. ఇదే తరుణంలో అమ్మ భూమవ్వ మృతి చెందారు.

తమ్ముడే తండ్రయ్యాడు..

అంతా శూన్యంలా మారినా ఆ సోదరులు తడబడలేదు. అన్నా.. నువ్వు బాగా చదువుకో నేను కష్టపడి డబ్బు సంపాదిస్తానంటూ తమ్ముడు సురేష్ ఉపాధి కోసం దుబాయ్ బాట పట్టారు. ఆయన సహకారంతో సుమన్ డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షలకు సన్నద్ధమై అన్నీ విజయవంతంగా పూర్తి చేశారు.



తమ్ముడు సురేష్‌తో అన్న సుమన్‌రెడ్డి

● "మన కష్టాలను మనమే ఎదుర్కోవాలి.. ఉన్నచోట నుంచి ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ప్రణాళిక, పట్టుదల చాలా కీలకం. మన ఇబ్బందులపై ఇతరులు తాత్కాలికంగా సానుభూతి చూపించొచ్చు. కానీ మనతో కలిసి నడిచే వారుండరు. ఆత్మవిశ్వాసంతో విజయం వైపు అడుగులు వేయడమే నా విజయానికి కారణమని ఆ యువ గెజిటెడ్ అధికారి సుమన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు"..

పీజీలు 'రెండు' బంగారు పతకాలు

సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఆంత్రోపాలజీ, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. చక్కని ప్రతిభతో రెండింటిలో బంగారు పతకాలు సాధించారు. యూజీసీ నెట్, తెలంగాణ సెట్ అర్హత సాధించారు.

ఇవీ సాధించిన ఉద్యోగాలు

✦ గురుకులాల్లో పాఠశాల, మాధ్యమిక, డిగ్రీ కళాశాల (2023 సంవత్సరంలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా పరీక్షలు రాసి) లైబ్రేరియన్‌గా ఏడాది కాలంలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

✦ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లైబ్రేరియన్ ఉద్యోగానికి 2022 నోటిఫికేషన్‌లో పరీక్ష రాసి ఆ కొలువు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు రీజియన్ జాలహళ్లిలో కేంద్రీయ విద్యాలయంలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

✦ తాజాగా విడుదలైన పాలిటెక్నిక్ కళాశాల లైబ్రేరియన్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 8వ ర్యాంకు, బాసర జోన్‌లో మొదటి ర్యాంకుతో ఏడాది కాలంలోనే తన అయిదో ఉద్యోగాన్ని సాధించారు. సొంతూరుకు చేరువలోనే నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సుమన్‌కు పోస్టింగ్ లభించింది. ఈ కొలువుకు గెజిటెడ్ అధికారి హోదా ఉండడంతో కేంద్రీయ విద్యాలయం ఉద్యోగాన్ని వదులుకున్నారు.

పశువుల కాపరి కుమారుడు అయ్యాడు ఉపాధ్యాయుడు..



జన్నారం, న్యూస్‌టుడే: కడు పేదరికం. నాన్న పశువుల కాపరిగా పనిచేస్తే వచ్చే కూలీ డబ్బులే వారికి కడుపు నింపేది. కష్టపడి చదివి నాన్న కష్టాల్లో పాలు పంచుకోవాలని కలలు కన్నాడు. అయితే తానొకటి తలిస్తే దైవం మరోలా చేసింది. ఇంటర్ చదివే సమయంలో తండ్రి మృతి చెందడంతో చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇక్కట్లు అధిగమించి ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ కొలువు సాధించారు.

జన్నారం మండలం మొర్రిగూడ ఎస్సీ కాలనీకి చెందిన సంతపురి చిన్నులు-మల్లవ్వ దంపతుల కుమారుడు సంతపురి అశోక్ జీవశాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 21వ ర్యాంకు సాధించగా ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి ఉన్న అశోక్ ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ప్రాథమిక విద్య మొర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో, ఆరు నుంచి ఇంటర్ వరకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహం, డిగ్రీ నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో, పీజీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసిన అశోక్ బీఈడీ నిజామాబాద్‌లో చదివారు. ఇంటర్‌లో తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయింది. చదువు పూర్తి కాగానే 2021లో వెన్నెలతో వివాహమైంది. అన్నయ్యలు శ్రీనివాస్, శంకర్, భార్య వెన్నెల, ఇద్దరు అక్కయ్యలు, చిన్ననాటి మిత్రుల సహకారంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి కొలువు సాధించానని, పేద విద్యార్థుల చదువుకు తనవంతు సహకారం అందిస్తానని అశోక్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కటిక పేదరికాన్ని జయించి కొలువు సాధించిన అశోక్‌ను కాలనీ వాసులు అభినందించారు.

పులి సంచారం.. భయం భయం!



కెరమెరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను కలవరపెడుతోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మండలంలోని పరందోలి, కరంజివాడ, లక్మాపూర్, ఇందాపూర్ గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లో పులి సంచరించిన విషయం విదితమే. కాగా ఈ వారంలో మండలంలోని కెరమెరి ఘాట్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎలాంటి ఉచ్చులు, విద్యుత్తు తీగలు అమర్చవద్దని, అటవీ సమీప గ్రామాలవాసులు అప్రమత్తంగా ఉండాలని జోడేఘాట్ ఎఫ్ఆర్ఓ జ్ఞానేశ్వర్ సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారిణి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సబ్-జూనియర్స్ విభాగంలో కీర్తి అగర్వాల్ 15 నుంచి హరియాణాలో నిర్వహించే పోటీలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఖేలో ఇండియా కేంద్రం శిక్షకుడు రాజేష్ శిక్షణలో ప్రతిభ చాటుతున్న ఆమెను జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి రాజ్‌వీర్ అభినందించారు.



క్రీడాకారిణి కీర్తి అగర్వాల్‌తో శిక్షకుడు రాజేష్



బాసరలో శోభాయాత్ర

బాసరలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాసర గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి అశ్వరథంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామంలోని మహిళలు, యువతులు నృత్యాలతో స్వాగతం పలికారు.



తనికెళ్ల భరణి మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



సరస్వతి అమ్మవారి సన్నిధిలో నిర్మాత దిల్‌రాజు దంపతులు

దర్శించుకున్న ప్రముఖులు

జ్ఞాన సరస్వతిని ఆదివారం సినీనటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాత దిల్‌రాజు బాసరలోని వేదభారతి పాఠశాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పక్షాన వారిని సన్మానించిన వేదపండితులు తీర్థప్రసాదాలను అందజేశారు.

తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా..

త్వరలో ఆదిలాబాద్ మీదుగా మూడు కొత్త రైళ్లు



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా మూడు కొత్త రైళ్లు పట్టాలెక్కనున్నాయి. ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైళ్ల కూతలు త్వరలో వినిపించనున్నాయి. కాజీపేట నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈ రైళ్లు వయా ఆదిలాబాద్ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో ఇరుప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. గతంలోనే కాజీపేట-ముంబయికి ఉన్న తాడోబా ఎక్స్‌ప్రెస్ రైలు తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా వారానికొకసారి నడిచేది. కరోనా సమయంలో రద్దుచేశారు. తాజాగా ఈ మార్గంలో రైలు మళ్లీ పునరుద్ధరించనున్నారు. మూడు ప్రత్యేక వారాంతపు రైళ్లకు సంబంధించి సమయసారిణి జారీ కావడం శుభపరిణామం. వీటి ప్రారంభానికి సంబంధించి ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది.

✦ కాజీపేట-పూణె ఎక్స్‌ప్రెస్ రైలు వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా ఉత్తరంవైపున ఉన్న మహారాష్ట్రలోకి ప్రవేశించి బల్లార్ష, మాంజిరి నుంచి తిరిగి పశ్చిమదిశలో తెలంగాణలోకి వచ్చి ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. ఆదిలాబాద్ మీదుగానే మళ్లీ పశ్చిమ ప్రాంతంలోని మహారాష్ట్రవైపున మన్మాడ్ చేరుకొని అక్కడి నుంచి నాందేడ్, ఔరంగాబాద్ మీదుగా పూణె వైపు మళ్లుతుంది. వారానికొకసారి నడిచే ఈ రైలు ప్రతి బుధవారం ఉదయం 6.35 గంటలకు పూణె నుంచి ప్రారంభమై గురువారం ఉదయం 6.30 గంటలకు కాజీపేట చేరుకుంటుంది. మధ్యలో ఆదిలాబాద్‌లో రాత్రి 11.45 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రతి గురువారం ఉదయం 8 గంటలకు కాజీపేట నుంచి బయలుదేరి పూణె వెళుతూ ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు అందుబాటులో ఉంటుంది. పూణెకు శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చేరుకుంటుంది.

✦ కాజీపేట-దాదర్ ప్రత్యేక రైలు(స్పెషల్ రైలు) సైతం మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా బల్లార్ష, వని, లింగ్టి నుంచి ఆదిలాబాద్‌కు మళ్లుతుంది. తిరిగి మహారాష్ట్రలోని కిన్వట్, నాందేడ్, ఔరంగాబాద్, పూణె మీదుగా దాదర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. కాజీపేట నుంచి శనివారం ఉదయం 11.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలకు మధ్యాహ్నం 12.59 గంటలకు, బెల్లంపల్లిలో మధ్యాహ్నం 1.19 గంటలకు, కాగజ్‌నగర్‌కు 2 గంటలకు, ఆదిలాబాద్‌కు రాత్రి 8.30 గంటలకు చేరి ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. దాదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు చేరుతుంది. అదే దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు కాజీపేటకు బయలుదేరే రైలు ఆదిలాబాద్‌లో సోమవారం ఉదయం 11.10 గంటలకు, కాగజ్‌నగర్ స్టేషన్‌లో సాయంత్రం 6.45 గంటలకు, బెల్లంపల్లిలో రాత్రి 7.05 గంటలకు, మంచిర్యాలలో రాత్రి 7.19 గంటలకు చేరి అక్కడి నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు కాజీపేట గమ్యానికి చేరుతుంది.

✦ కరీంనగర్-పూణె వారానికొకసారి స్పెషల్‌రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ నుంచి బయలుదేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లార్ష, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పూణెకు వెళుతుంది. కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలలో ఉదయం 7.16 గంటలకు, కాగజ్‌నగర్‌లో 8.50 గంటలకు, ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. పూణెకు గురువారం ఉదయం 9.45 గంటలకు చేరుకుంటుంది. అదే పూణె రైల్వేస్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు అక్కడ సోమవారం రాత్రి 10.45 గంటలకు బయలుదేరే రైలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్‌లో, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాత్రి 10.48 గంటలకు, మంచిర్యాలకు రాత్రి 11.36 గంటలకు చేరుకుంటుంది.

రూ.54.70 కోట్ల మద్యం తాగేశారు

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది దసరా సందర్భంగా పక్షం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.54.70 కోట్ల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. గత సంవత్సరం కంటే ఇది రూ.9.15 కోట్లు అధికం. గతేడాది దసరా సందర్భంగా 12 రోజుల్లో రూ.45,54,55,135 మద్యం విక్రయాలు జరగగా ఈ ఏడాది రూ.54,69,95,145 మద్యం అమ్ముడైంది.

ఉమ్మడి జిల్లాలో దసరా సందర్భంగా పక్షం రోజుల్లో జరిగిన అమ్మకాలు జిల్లాల వారీగా (రూ.లలో)

జిల్లా	గతేడాది	ఈ ఏడాది విక్రయాలు
ఆదిలాబాద్	8,23,70,060	11,10,90,368
నిర్మల్	11,03,53,360	12,06,32,027
కుమురంభీం	5,75,21,925	7,62,75,947
మంచిర్యాల	20,52,09,790	23,89,96,803
మొత్తం	**45,54,55,135**	**54,69,95,145**

చేయూతతో.. చేనేతల్లో ఆనందం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:

రెక్కల కష్టాన్ని నమ్ముకుని కులవృత్తితోనే ఏళ్ల తరబడి చేనేతలు జీవనం సాగిస్తున్నారు. చేసిన పనికి గిట్టుబాటు ధర లభించనప్పటికీ, మరో పని చేయలేక అదే వృత్తిలో కొనసాగుతున్నారు. సహకార సంఘాలు వారికి కొంత మేరకు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇటీవల 'చేనేతకు చేయూత' పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో.. చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే తమ జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కోసిని సొసైటీలో వస్త్రం నేస్తున్న చేనేత కార్మికురాలు

ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం కోసినిలో కొనసాగుతున్నాయి. కోసినిలోని సహకార సంఘం అయిదు దశాబ్దాల కిందట 80 మంది కార్మికులతో ప్రారంభమైంది. ప్రభుత్వ చేయూత కొరవడటంతో ప్రస్తుతం 30 మందికి తగ్గిపోయింది. చెన్నూరులో 1949లో సహకార సంఘం ఏర్పాటు కాగా 40 మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం దినదినాభివృద్ధి చెందుతూ 500 మంది కార్మికులతో విజయవంతంగా కొనసాగింది. చెన్నూరుతోపాటు కోటపల్లి, జైపూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల కార్మికులు సంఘంలో చేరి వస్త్రాలు నేశారు. అనంతర కాలంలో ఈ రెండింటికీ ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, నూలు వస్త్రాల దిగుమతిలో ఇబ్బందులు, తదితర కారణాలతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించి అనంతరం ఏర్పడ్డ పరిస్థితులతో వస్త్రాలు నేస్తున్న కార్మికులకు కూలీ గిట్టుబాటు కాకపోవడం, అప్పటి ప్రభుత్వాలు సహకారం లేకపోవడంతో.. చాలా మంది పనిమానేశారు.

గడువులోపే..

చేనేతలకు ప్రభుత్వం 'చేనేతకు చేయూత' పథకం ప్రారంభించగా.. కార్మికులు 2021లో చేరి నెల నెలా ఆర్డీ రూపంలో నగదు జమ చేశారు. కార్మికుడు ప్రతి నెలా తన ఖాతాల్లో రూ.500 జమ చేస్తే ప్రభుత్వం మరో రూ.వెయ్యి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. పథకం 2021 సెప్టెంబర్‌లో ప్రారంభమై 2024 ఆగస్టుతో ముగిసింది. మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఆర్డీ రూపంలో జమ చేసిన సొమ్ము ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండింతల సొమ్ము కార్మికుల ఖాతాల్లో ఇటీవలే జమ కావడం వారిలో కొంత ఊరటనిచ్చింది. ఈ పథకాన్ని కొనసాగిస్తే తమకు కొండంత అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

-నల్ల కనకయ్య, చేనేత సహకార సంఘం కార్యదర్శి, కాగజ్‌నగర్



చేనేతకు చేయూత పథకంలో సొసైటీ కార్మికుల ప్రతి నెలా మూడు సంవత్సరాలపాటు నగదు జమ చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాటా కలిపి నిధులు విడుదల చేయడం సంతోషాన్నిచ్చింది. తిరిగి ఈ పథకాన్ని కొనసాగిస్తే కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లవుతుంది. సంఘాల్లో సభ్యుల సంఖ్య పెరిగి అభివృద్ధి సాధిస్తాయి. కార్మికులకు అమలు చేస్తున్న నేతబీమా పథకం 75 సంవత్సరాల వయసుకు పెంచాలి. చాలా మంది సంఘంలో వృద్ధులు ఉన్నందున బీమా పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి. 2020లో తీసుకున్న ముద్ర రుణాలు మూడేళ్ల పాటు వడ్డీతో కలిపి చెల్లించారు. రుణం మొత్తాన్ని మాఫీ చేయాలి.

తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా పి.రాజేశ్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: చాంద(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పి.రాజేశ్ తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా ఎంపికయ్యారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ నెల 17 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన తెలంగాణ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించి ఎన్నో పతకాలు సాధించిన ఆయన జిల్లా జట్టుకు తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రావడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రతిభను గుర్తించి తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం తెలంగాణ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఈ ఘనత సాధించినందుకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జిల్లా క్రీడాధికారులు వేంకటేశ్వర్లు, పార్థసారథి ఆయనకు అభినందనలు తెలిపారు.

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? మండలంలోని చింతగూడ నుంచి బలగల శివారులోని పంట పొలాలకు వెళ్లే బాటకు ఇరువైపులా ముళ్లపొదలు ఆవరించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
- ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.రాంచందర్, స్థానికుడు

✔ రెండ్రోజుల్లోగా ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటా.
- ఎంపీడీఓ రమేష్, కాగజ్‌నగర్

తిర్యాణి, న్యూస్‌టుడే

? తిర్యాణి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న నీటిశుద్ధ యంత్రం చెడిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- రమేష్, స్థానికుడు

✔ గ్రామ పంచాయతీకి నిధులు విడుదల కాగానే మోటారుకు మరమ్మతు చేయించి నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.
- రాజేశ్వరీ, పంచాయతీ కార్యదర్శి, తిర్యాణి.

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

? జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి మజీద్ ప్రాంతంలో కొన్ని ఇళ్లకు భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. వచ్చేది సన్నగా రావడంతో నీరు సరిపోవడంలేదు. ప్రత్యామ్నాయంగా ఉన్న నీటి పథకం ద్వారానైన పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా చూడాలి - రాజేష్, బజార్‌వాడి.

✔ పరిశీలించి సరిపడా నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- భుజంగ్‌రావు, పుర కమిషనర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కాగజ్‌నగర్: పట్టణంలోని సర్‌సిల్క్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08లో 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సంగోజు సూర్యప్రకాశ్, ఏటుకూరి శ్రీనివాసరావు, ఇందారపు ప్రకాశ్, గుల్లపల్లి రవిశంకర్, డెబ్బటి సత్యనారాయణ, గంగాభవాణి, సునీత, పరికిపల్ల వెంకటరమణ, ఇమాముద్దీన్‌లను సత్కరించారు. కొత్రంగి శేఖర్, అన్నారావు, తాజుద్దీన్, గుమ్మడి నవీన్, ప్రణీల్, శివాజీ, ప్రణోత్, దేవేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోండి: ఎమ్మెల్సీ

రెబ్బెన, న్యూస్‌టుడే: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం మండలంలోని కనకదుర్గాదేవి స్వయంభు శ్రీ మహాంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. పదో రోజు అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అమ్మవారికి ఒడి బియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయం భక్తులకు కొంగు బంగారంగా మారిందన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవర వినోద్ అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.


ఇందిరానగర్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్


ర్యాలీలో భాగంగా నినాదాలు చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు, తదితరులు

చర్చలు జరపకుండా అడ్డుకుంటున్న యాజమాన్యం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్పీఎం పర్యావరణ్ కమిటీ చర్చలకు వస్తామని చెప్పినప్పటికీ యాజమాన్యం అడ్డుకుంటోందని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిశోర్‌బాబు ఆరోపించారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆదివారం పట్టణంలో ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్పీఎం పర్యావరణ్ కమిటీ ఆదివారం ఉదయం 11 గంటలకు చర్చలకు వస్తామని చెప్పారని, యాజమాన్యం అడ్డుకోవడంతోనే చర్చలకు రాలేదని ధ్వజమెత్తారు. చర్చలతో యాజమాన్యం లొసుగులు బయటకు వస్తాయనే కార్మికులను చర్చలకు రాకుండా అడ్డుకుంటోందని విమర్శించారు. స్థానికేతరుల లాభం కోసమే మిల్లు తెరిచారని, స్థానికులకు ఉపయోగం లేకుండా పోతోందన్నారు. మిల్లుతో కాగజ్‌నగర్‌లో ఆసుపత్రులు మాత్రమే అభివృద్ధి చెందాయని, కాలుష్యంతో ప్రజలు రోగాలబారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఎస్పీఎం మొండి వైఖరి మానుకోవాలని, యాజమాన్యం దిగిరాకపోతే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి మాజిద్, యూసుఫ్, ఉస్మాన్‌తోపాటు సభ్యులు పాల్గొన్నారు.


త్రిశూల్‌పహాడ్‌పై దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ దంపతులు, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల


తిర్యాణి: కన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో జమ్మిచెట్టుకు పూజలు


ఆసిఫాబాద్‌లో లక్కీ డ్రా విజేతలతో కమిటీ సభ్యులు


ఈజ్‌గాం శివాలయ ఆవరణలో...

ఘనంగా విజయదశమి వేడుకలు


చింతలమానెపల్లి మండల కేంద్రంలో రావణ దహనం


రెబ్బెనలో రావణ బొమ్మ వద్ద సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, పార్టీ నాయకులు


ఆసిఫాబాద్‌లో ఉత్సవాల బందోబస్తు పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీష్‌కుమార్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: విజయ దశమి పురస్కరించుకుని శనివారం పట్టణంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రిశూల్‌పహాడ్‌పై జరిగిన వేడుకల్లో రావణ దహనాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బంధుమిత్రులంతా కలుసుకుని ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొనఆనరు. భారాస రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్, హిందూ ఉత్సవ సమితి నాయకులు సింధం శ్రీనివాస్, తాటి శ్రీనివాస్, తుమ్మ రమేశ్‌తోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ గ్రామీణం, బెజ్జూరు: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయంలో సిర్పూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్, ఆలయ ఛైర్మన్ మైలారపు మురళీధర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద ఛైర్మన్ దంపతులు, ఈఓ వేణు వేణుగుప్త, వేదపండితుడు ముద్దు నరహరిశర్మ, అర్చకులు సంతోష్‌శర్మ, రాజేశ్వర్ రావులు శమీ పూజలు నిర్వహించారు. మండలంలోని భట్టుపల్లి, చింతగూడ, కాగజ్‌నగర్ పట్టణం, తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

చింతలమానేపల్లి కౌటాల: మండల కేంద్రం తోపాటు, బాబాసాగర్, ఖర్జెల్లీ, రవీంద్రనగర్, తదితర గ్రామాలలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఆయుధ పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టుకు వద్దకు వెళ్లి పూజలు చేసి ఒకరికి ఒకరు ఆలింగనాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని అభయాంజనేయ ఆలయ ఆవరణలో రావణ దహనాన్ని నిర్వహించారు.

వాంకిడి: మండల కేంద్రంలో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామస్థులంతా ఊరేగింపుగా కిలోమీటరు దూరంలోని జమ్మి చెట్టు వద్దకు చేరుకున్నారు. పురోహితులు ఏక బిల్వం నరేందర్ ఆధ్వర్యంలో జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని కన్యక పరమేశ్వరీ ఆలయ ఆవరణ, హనుమాన్ మందిరంలో నెలకొల్పిన జమ్మి చెట్లకు అర్చకులు హరిప్రసాద్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.


బెజ్జూరులో శమీ పూజలు

గోలేటి కార్మిక వాడల్లో..

గోలేటి టౌన్‌షిప్: బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రాంతమైన గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో, రెబ్బెనలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోలేటి కోదండ రామాలయం నుంచి ముందుగా అమ్మవారిని ఒగ్గు కళాకారుల నృత్యాలతో, బాజాభజంత్రీల మధ్య పల్లకీలో ఊరేగించారు. పల్లకీని జీఎం ఎం.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు తీసుకెళ్లారు. సింగరేణి ఉద్యోగులతో పాటు యూనియన్ నాయకులు, కార్మిక కుటుంబాలు బాణసంచా కాల్చుస్తూ నృత్యాలు చేశారు. మైదానం అంతా జనంతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా రావణ దహనాన్ని నిర్వహించారు.


గోలేటిలో రావణ దహనం వద్ద జీఎం శ్రీనివాస్, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గురుకులాలన్నీ సమీకృతమే

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొనసాగుతున్న గురుకులాలన్నీ సమీకృతమేనని, మొదటి నుంచే అన్ని కులాలను కలుపుకొని సమీకృతంగా కొనసాగుతున్నాయన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలని భారాస రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 640 మంది విద్యార్థులు ఒకచోట ఉంటేనే నిర్వహణ కష్టతరంగా మారుతుందని, 2,560 మందిని ఒకేచోట చేర్చితే అనేక సమస్యలు వస్తాయని, ఇందుకు బాసర ట్రిపుల్ ఐటీనే ఉదాహరణ అని పేర్కొన్నారు. గురుకులాల్లో అవసరమైన వసతులు కల్పించి నిధులు కేటాయించాలన్నారు. కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ ఉన్నాయని, ప్రతి వ్యవస్థలో ఇది కొనసాగుతోందన్నారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గిరిజన, బీసీ సంక్షేమ గురుకులాలు ఉంటే తప్పేంటని ప్రశ్నించారు. ఆయా మండలాల్లో కేటాయించిన గురుకులాలను సామాజిక న్యాయ సూత్రం ప్రకారం కొనసాగించాలన్నారు. నాయకులు లెండుగురె శ్యాంరావు, నక్క మనోహర్, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

బెంగాలీ గ్రామాల్లో నయనానందకరం..

కాగజ్‌నగర్ గ్రామీణం: జిల్లాలోని వివిధ మండలాల్లో స్థిరపడిన బెంగాలీలు దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8న ప్రారంభమై శనివారం ముగియగా.. ఎమ్మెల్యే హరీశ్‌బాబు హాజరై దుర్గమ్మను దర్శించుకున్నారు. మండలంలోని విలేజి నెం.5,12, మార్కెట్ ఏరియాలో ఉన్న మండపాల వద్ద జాతర తలపించేలా సందడి కనిపించింది. రాత్రివేళల్లో ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాల బెంగాలీలతో పాటు ఈజ్‌గాం, సీతానగర్, నామానగర్, గన్నారం, ఆరెగూడ, మోసం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.


దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఉత్సవాలు ముగిసె.. భక్తులు పులకరించె

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : దేవీ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వివిధ రూపాలలో దర్శనమిచ్చిన దుర్గమ్మ.. ముగింపు సందర్భంగా ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అంబేడ్కర్ చౌరస్తా, రాజీవ్‌గాంధీ చౌరస్తా, లారీచౌరస్తా, పెట్రోల్ పంపు ఏరియాల మీదుగా పెద్దవాగు వరకు శోభాయాత్ర కొనసాగించారు. మహిళల కోలాటాలు, భజనలు, యువత ఆనందోత్సాల మధ్య టపాసుల మోతతో సాగిన శోభాయాత్ర కనుల పండుగగా కొనసాగింది. పెద్దవాగు వద్ద నిమజ్జనం చేశారు. టౌన్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


వాంకిడి ఇందిరానగర్ మండపంలో మహిళల పూజలు


బెజ్జూరులో మహిళల కోలాటాలు


గోలేటిలో దుర్గాదేవి శోభాయాత్ర

వాంకిడి, బెజ్జూరు, తిర్యాణి, బల్లార్ష: మండల కేంద్రంలో నిర్వహించిన శారదా దేవి నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. ఇందిరానగర్, హన్‌మాన్ మందిర్ కాలనీ మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను మహిళలు కోలాటాలు, నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చిక్లీ వాగులో నిమజ్జనం చేశారు. ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం దుర్గా, శారదా దేవి విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద వివిధ బహుమతుల లక్కీడ్రా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి శోభాయాత్ర చేపట్టారు. మహిళల కోలాటాలు, నృత్యాలతో కనుల పండువగా సాగింది. పెద్దవాగులో నిమజ్జనం చేశారు.

రెబ్బెన: రెబ్బెన మండలంలో దుర్గామాత శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. దేవి నవరాత్రులు ముగియడంతో ఆదివారం దుర్గామాత విగ్రహాన్ని మండలి వద్ద నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి, దుబ్బగూడెం, రెబ్బెన, అంబేడ్కర్‌నగర్ తదితర మండపాల్లో పతిష్ఠించిన దుర్గామాత విగ్రహాన్ని వాహనాలపై చేర్చి ప్రధాన వీధుల ద్వారా శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులు, యువకులు, మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి. ఏలాంటి అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోస్తు ఏర్పాటు చేశారు. అనంతరం వాగు వద్ద విగ్రహాన్ని ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చి నిమజ్జనం చేశారు.


వాసవీ శారదా మండలి నిమజ్జన శోభాయాత్రలో మహిళల సందడి


ఆసిఫాబాద్‌లో.. యువతుల నృత్యాలు

పురుగుమందు తాగి మహిళ బలవన్మరణం

తిర్యాణి, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగీ కోలాంగూడకు చెందిన టేకం బక్కు రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి అతని భార్య టేకం రాజుబాయి(43) మానసికంగా తరచూ బాధపడుతుండే వారు. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మొదట తిర్యాణి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు టేకం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడాపోటీల నిర్వహణకు సహకారమందిస్తా

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: యువత పెడదారి పట్టకుండా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భారాస రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మోసం పంచాయతీలోని ఆరెగూడలో వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడానైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ పోటీలు నిర్వహించకపోవడంతో ప్రతిభ బయటకు రావడం లేదన్నారు. ప్రతి గ్రామంలో పోటీలు నిర్వహించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. భారాస నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు లాజిస్టిక్ సలీం, మనోహర్, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, తదితరులున్నారు.


బీఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మారపల్లి అంబేడ్కర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు

రెబ్బెన, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేసే కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం బీఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మారపల్లి అంబేడ్కర్‌తో పాటు పలువురు పార్టీలో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం సింగరేణి కార్మిక లోకానికి చేసిందేమీలేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కేసరి కిషన్‌గౌడ్, ఎర్రం తిరుపతి, మద్దెల సురేందర్‌రాజు, కోరుట్ల యాదగిరి పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో ఈ నెల 8వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. నిషాని జట్టు, తిర్యాణి జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్లకు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు నగదు బహుమతితో పాటు, జ్ఞాపికలు అందజేశారు. ఎస్సై ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, నాయకులు జమాల్‌పూర్ సుధాకర్, దుర్గం ప్రశాంత్, విలాస్, జయరాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవం వేంకటేశ్వర స్వామి కల్యాణం

బల్లార్ష, న్యూస్‌టుడే : బల్లార్షలోని బాలాజీ ఆలయంలో దసరా పండగ పురస్కరించుకొని శనివారం వేంకటేశ్వర స్వామి, అలివేలుమంగ, లక్ష్మీదేవిల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి వారి విగ్రహ మూర్తులను సుందరంగా అలంకరించి పండితులు రామాంజనేయ చార్యులు, పాండే మహారాజ్‌ల మంత్రోచ్చరణల మధ్య క్రతువు జరిపించారు. భారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.


వాంకిడిలో అంబేడ్కర్, బుద్ధుడి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు


కాగజ్‌నగర్‌లో..


బెజ్జూరులో ర్యాలీ

ధమ్మచక్ర పరివర్తన్ దివస్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శనివారం అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో ధమ్మచక్ర పరివర్తన్ దివస్ నిర్వహించారు. పంచశీల జెండా ఆవిష్కరించి బుద్ధ వందనం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. వినోద్, అశోక్, సుధాకర్, రవిదాస్, నితిన్, శంకర్, హొక్టు, కృష్ణాజి, తుకారాం, పెంటయ్య తదితరులున్నారు.


ఆసిఫాబాద్‌లో.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్: పట్టణంలోని చంద్రమణి బుద్ధ విహార్‌లో అశోక విజయదశమి, ధమ్మచక్ర పరివర్తన దివస్‌ను నిర్వహించారు. బుద్ధవందనం, పంచశీల జెండావిష్కరణ అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలోని విగ్రహానికి పూలమాలలు వేశారు. 22 ప్రతిజ్ఞలు చేసి ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. మాతా రమాబాయి మహిళా మండలి సభ్యులు ఉప్రె కమల, మహాత్మా సుమిత్ర, రాంటెంకి నందనాయి, భారతీయ బౌద్ధ మహిసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, సమతా సొసైటీ సభ్యులు రాంచందర్, ప్రభాకర్, అంబేడ్కర్ మెమోరియల్ అధ్యక్షుడు డోంగ్రె సంతోష్, లహను తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండల కేంద్రంతో పాటు, బాబాసాగర్, డబ్బా, గూడెం, రుద్రపూర్ గ్రామాలలో దమ్మ చక్రపరివర్తన దివస్‌ను మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఎస్సై యాదవ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. దుర్గం జనార్దన్, తిరుపతి, మల్లయ్య, రామ్‌చందర్, హన్మంతు పాల్గొన్నారు.

బెజ్జూరు: అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచశీల జెండాలు ఆవిష్కరించారు. బుద్ధ వందనం చేశారు. సంఘం అధ్యక్షుడు వాసుదేవ్, పెద్దలు పెంటయ్య, సంజీవ్, రవి, కేశవ్, యువకులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంతో పాటు ఇంధాని, ఖమాన, ఖిరిడి, ఖనర్‌గాం గ్రామాల్లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో.. పంచశీల జెండా ఆవిష్కరించి, సంఘం అధ్యక్షుడు ఉప్రె జయరాం, ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు హంసరాజ్, సభ్యులు విలాస్, శ్యాంరావు, సందీప్, ప్రసాద్, గోపినాథ్, ప్రతాప్, ప్రశాంత్, మహిళలు పాల్గొన్నారు.